సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం : 26 : డిసెంబర్ : 2024



దైవ దర్శనానికి వచ్చి..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చి వెళ్తుండగా కారు చెట్టును ఢీకొని ఇద్దరు మృతి చెందారు. - 8లో



గర్భిణుల్లో ఫ్లోరైడ్ లక్షణాలు

మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, బట్లపల్లి గ్రామాల పరిధిలో అత్యధికంగా ఫ్లోరైడ్ ఉన్నట్లు సర్వేలో తేలింది. - 8లో



దారికి రాని పనులు

చౌటుప్పల్‌లోని సర్వీస్ రోడ్డు వెంట చేపట్టిన డ్రెయినేజీ పనుల కారణంగా బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. - 10లో

న్యూస్‌రీల్

27 నుంచి భూ పత్రాల స్వీకరణ

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, కేసారం, ఎర్రంబెల్లి, తుక్కాపురం, పెంచికల్‌పహాడ్, రాయగిరి గ్రామాల పరిధిలో కిలోమీటర్ 118.188 నుంచి 133.178 కి.మీ పరిధిలోని రైతులు తమ భూముల వివరాలకు సంబంధించిన పత్రాలు అందజేయాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న గౌస్‌నగర్, కేసారం, 28న ఎర్రంబెల్లి, తుక్కాపురం, 30న పెంచికల్‌పహాడ్, రాయగిరి గ్రామాల రైతులు భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. భూమి విస్తీర్ణం, భూమిలో ఉన్న ఆస్తులు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలను ఫార్మాట్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు.

నేడు యాదగిరిగుట్టలో స్వాతి నక్షత్ర పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. వేకువజామున 5గంటలకు వైకుంఠద్వారం నుంచి గిరిప్రదక్షిణ ఉంటుందని, అదే విధంగా కొండపైన స్వాతి హోమం, శత ఘటాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన మండపాల్లో యాద రుషి, ప్రహ్లాదుడి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని ఈవో వివరించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు శారాజీపేట విద్యార్థులు



అలకుంట్ల వైష్ణవి (ఖోఖో)



దూడల తేజస్వి (ఖోఖో)



వస్పరి జాగృతి (కబడ్డీ)

ఆలేరురూరల్ : ఆలేరు మండలం శారాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ గడసంతల మధుసూదన్ తెలిపారు. భువనగిరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఖోఖోలో అలకుంట్ల వైష్ణవి, దూడల తేజస్వి, కబడ్డీ విభాగంలో వస్పరి జాగృతి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వరంగల్‌లో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, సంజీవరెడ్డి, రామచందర్, కాంతారావు, శ్రీనివాస్ అభినందించారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణంలో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : పట్టణంలోని హైదరాబాద్ - విజయవాడ రహదారిపై బుధవారం వాహనాల రద్దీ నెలకొంది. క్రిస్మస్ పండుగ, వరుసగా రెండు రోజుల సెలవులు రావడంతో పాటు శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజానీకం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో హైవేపై వాహనాల రద్దీ ఏర్పడింది. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణంలో వాహనాలు బారులుదీరడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.







హ్యాపీ క్రిస్మస్ క్రిస్మస్ సందర్భంగా బుధవారం భువనగిరిలోని మన్నా చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు, ఏసుక్రీస్తు గీతాలు ఆలపిస్తున్న యువతులు

భువనగిరిలోని బాప్టిస్టు చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

నలుగురు అంగన్‌వాడీ టీచర్లు సస్పెన్షన్

భువనగిరిటౌన్ : పోషకాహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడిన నలుగురు అంగన్‌వాడీ టీచర్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలేరు ప్రాజెక్ట్ పరిధిలో ముగ్గురు, మోత్కూర్ సెంటర్-7కు చెందిన టీచర్లు సస్పెండ్ అయిన వారిలో ఉన్నారు. ఈనెల 12వ తేదీన భువనగిరిలోని చీమల నరేశ్ పశువుల పాకలో బాలామృతం ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 180 కిలోల బాలామృతం స్వాధీనం చేసుకున్నారు. నరేశ్‌ను విచారణ చేయగా మోత్కూరుకు చెందిన బీసు ప్రశాంత్ (బాలామృతం పంపిణీదారుడు) దగ్గర తీసుకున్నట్లు తెలియజేశాడు. ఈ మేరకు పోలీసులు ప్రశాంత్ ఇంట్లో తనిఖీలు చేయగా వంద కిలోల బాలామృతంతో పాటు 48 లీటర్ల పాలు లభించాయి. విచారణ నివేదికను జిల్లా సంక్షేమ అధికారులు కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించగా వ్యత్యాసం వచ్చింది. లబ్ధిదారులకు పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయటాన్ని గుర్తించారు. నివేదికల ఆధారంగా నలుగురు అంగన్‌వాడీ టీచర్లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రోజంతా ముసురు

- చలిగాలులతో ఇబ్బంది పడ్డ ప్రజానీకం

భువనగిరి, భువనగిరి టౌన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ముసురు వానతో పాటు చల్లటి గాలులు కూడా వీయడంతో ప్రజానీకం ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల నుంచి పెద్దగా బయటకు రాలేదు. గరిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

మండలాల వారీగా వర్షపాతం (మి.మీ)

రాజాపేట మండలంలో 9.8 మి.మీ, చౌటుప్పల్‌లో 9, భువనగిరి 6.8, అడ్డగూడూరు 6.3, వలిగొండ 5.5, భూదాన్‌పోచంపల్లి 5.0, గుండాల 5.0, సంస్థాన్‌నారాయణపురం 4.8, ఆలేరు 3.5, రామన్నపేట 3.5, మోత్కూరు 3.0, తుర్కపల్లి 2.8, మోటకొండూరు 2.5, ఆత్మకూర్ (ఎం) 2.5, బీబీనగర్ మండంలంలో 2.5 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



భువనగిరిలో వర్షంలో వెళ్తున్న ప్రయాణికులు

కమలం సారథిని మారుస్తారా!

ప్రస్తుత అధ్యక్షుడినే కొనసాగిస్తారా .. కొత్త వారికి అవకాశం ఇస్తారా

- బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిపై ఆసక్తికర చర్చ
- పోటీలో పలువురు ఆశావహులు
- అధినాయకత్వం వద్ద ప్రయత్నాలు



సాక్షి యదాద్రి : బీజేపీ జిల్లా అధ్యక్ష పీఠం కోసం ఆ పార్టీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా పాశం భాస్కర్ ఉన్నారు. అయితే అధ్యక్షుడి మార్పు అనివార్యమైతే తమకు అవకాశం ఇవ్వాలని పలువురు నాయకులు అధినాయకత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బూత్‌కమిటీలు, మండల అధ్యక్షులతోపాటు సీనియర్ నాయకుల అభిప్రాయాలను తీసుకుని అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది.

భాస్కర్‌ను నియమించి ఏడాది..

పార్టీ నియమావళి ప్రకారం అధ్యక్షుడు మూడు సంవత్సరాలపాటు పదవిలో ఉంటారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత నియామకమైన అధ్యక్షుడు పాశం భాస్కర్ పదవీకాలం ఏడాది మాత్రమే దాటింది. ఇంకా రెండేళ్ల సమయం ఉండడంతో ఆయనే కొనసాగే అవకాశం ఉందని పార్టీ నాయకుడొకరు సాక్షితో చెప్పారు. అతను కూడా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగేందుకు సిద్ధంగానే ఉన్నారు.

ఆశావహులు వీరే..

పాశం భాస్కర్‌ను అధ్యక్షుడిగా కొనసాగించని పక్షంలో తమకు అవకాశం కల్పించాలని పలువురు బీజేపీ నాయకులు అధిష్టానానికి విన్నవించుకుంటున్నారు. సామాజిక వర్గ సమీకరణలు, ప్రాంతాల వారీగా పోటీపడుతున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, కిసాన్ మోర్చా నాయకుడు పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, కడకంచి రమేష్, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చందామహేందర్‌గుప్తా, వంగేటి విజయభాస్కర్‌రెడ్డి ఇలా పలువురు నాయకులు పోటీపడుతున్నారు. పదవిని ఆశిస్తున్న మరికొందరు క్షేత్ర స్థాయిలో బూత్‌కమిటీ సభ్యులు, మండల, మున్సిపల్ కార్యవర్గ సభ్యులను మచ్చిక చేసుకుంటున్నారు. తనకు మద్దతు పలకాలని కేడర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంస్థాగతంగా అభిప్రాయ సేకరణ

పార్టీ రాష్ట్ర నాయకత్వం అధ్యక్షుని నియామకం విషయంలో సంస్థాగతంగా అభిప్రాయ సేకరణ చేస్తోంది. అయితే ఆలేరు, భువనగిరి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకుంటారా.. లేక జిల్లా మొత్తంగా యూనిట్‌గా తీసుకుంటారా అనే విషయంలో స్పష్టత రాలేదు. ప్రస్తుతం సభ్యత్వాల సేకరణ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా 12 మండలాలు, 4 మున్సిపాలిటీల్లో చేశారు. దీంతో ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 50 వేల సభ్యత్వం పూర్తి చేసినట్లు ఆపార్టీ నాయకులు చెబుతున్నారు. మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిని మరో రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాలను పరిగణలోకి తీసుకుంటే సభ్యత్వాలు బూత్ కమిటీలు, మండల కమిటీల ప్రతినిధులు సంఖ్య మరింత పెరగనుంది. వీరందరి అభిప్రాయాలు తీసుకుని తరువాత నూతన అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని పార్టీ ముఖ్యుడొకరు పేర్కొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన




కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి, కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భువనగిరిటౌన్ : తమ డిమాండ్ల సాధనకోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష 16వ రోజుకు చేరింది. బుధవారం కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఓవైపు వర్షం కురుస్తున్నా గొడుగులు ధరించి దీక్ష కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాండు, తిరుపతి , సుద్దాల భారతి, ఉద్యోగులు అరుణ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ప్రసాదానికి విజయ నెయ్యి

జనవరి 1నుంచి సరఫరా

- ప్రభుత్వ ఆదేశాల అమలుకు సన్నాహాలు
- మదర్ డెయిరీతో తెగిపోనున్న 35 ఏళ్ల అనుబంధం
- ఏటా రూ.18 కోట్ల ఆదాయం కోల్పోనున్న సంస్థ.. ఇప్పటికే నష్టాల ఊబిలో..
- గుట్టను మినహాయించాలని ముఖ్యమంత్రికి వేడుకోలు



సాక్షి, యాదాద్రి : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జనవరి 1నుంచి విజయ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని ఇకపై విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో యాదగిరిగుట్ట క్షేత్రానికి మదర్ డెయిరీతో 35 ఏళ్లుగా ఉన్న అనుబంధం తెగిపోనుంది. దీంతో పాటు నల్లగొండ జిల్లాలోని చెర్వుగట్టు క్షేత్రానికి సైతం విజయ డెయిరీ నుంచే నెయ్యి సరఫరా జరగనుంది.

కోల్పోనున్న ఆదాయం ఇలా..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మదర్ డైయిరీ ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, చెర్వుగట్టుతో పాటు రాష్ట్రంలోని కీసర, వేములకొండ తదితర ఆలయాలకు కొన్నేళ్లు మదర్ డెయిరీ ద్వారా నెయ్యి సరఫరా చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.36 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇందులో ఒక్క యాదగిరిగుట్ట ఆలయానికే నెలకు 30 టన్నుల నెయ్యిని మదర్ డెయిరీనుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు గాను దేవస్థానం ఏటా రూ.18 కోట్ల వరకు చెల్లిస్తుంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న మదర్ డైయిరీ.. ప్రభుత్వ నిర్ణయంతో మరింత చతికిలపడే పరిస్థితి నెలకొంది.

అత్యధిక రైతులు యాదాద్రి భువనగిరి జిల్లాలోనే..

ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న నార్ముల్ మదర్ డైయిరీలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రైతులే ఉన్నారు. జిల్లాలో 24 చిల్లింగ్ సెంటర్లు ఉండగా, 435 సొసైటీల ద్వారా సుమారు 45 వేల మంది రైతులు రోజూ సగటున లక్ష లీటర్ల పాలు పోస్తున్నారు. ఇందులో అధికంగా భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పరిధిలోని 30 వేల మంది రైతులు 12 చిల్లింగ్ సెంటర్లలో 60 వేల లీటర్ల పాలు పోసి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ గడిచిన 40 ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రైవేట్ డైయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చినా రైతులు మదర్ డైయిరీని కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంలో యాదగిరిగుట్ట, చెరువుగుట్టు దేవాలయాలను మినహాయించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే వేలాది మంది రైతులకు అండగా ఉన్న మదర్ డైయిరీ మరింత నష్టాలబారిన పడే అవకాశం ఉంది.

మదర్ డెయిరీ నుంచే సరఫరా చేయాలి



రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలకు జనవరి 1నుంచి విజయ డైయిరీ నెయ్యి సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యాదగిరిగుట్ట దేవస్థానానికి ప్రతి నెలా 30 టన్నుల నెయ్యి మదర్ డైయిరీ సరఫరా చేస్తుంది. ఇది డెయిరీకి అతిపెద్ద ఆదాయ వనరు. గుట్టకు మదర్ డెయిరీ నెయ్యినే సరఫరా చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

–గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

వెల్లుల్లి కిలో రూ.450

భువనగిరి : వెల్లుల్లి ధర ఆకాశాన్నంటింది. పక్షం రోజుల క్రితం రూ.350 ఉండగా ఉన్న ధర అదనంగా రూ.100 పెరిగింది. ప్రస్తుతం రూ.450 ధర పలుకుతోంది. పంట స్థానికంగా పండించక పోవడమే దీనికి ప్రధాన కారణం. దీని కోసం ఇతర రాష్ట్రంపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మధ్యప్రదేశ్‌నుంచి దిగుమతి

వెల్లుల్లిని మధ్యప్రదేశ్ నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఆ రాష్ట్రం నుంచి నేరుగా లారీల ద్వారా సరుకు రవాణా అవుతుంది. కొన్నిసార్లు హైదరాబాద్‌లోని ప్రధాన మార్కెట్ల నుంచి కూడా దిగుమతి చేసుకుంటున్నారు.

కొత్త సరుకు వస్తేనే..

గత ఏడాది కిలో వెల్లుల్లి రూ.200 నుంచి రూ.300 ఉండేది. ప్రస్తుతం రూ.450 వరకు పలుకుతోంది. దీంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌నుంచి పాత సరుకే వస్తోంది. కొత్త సరుకు వచ్చే వరకు ధర తగ్గే అవకాశం లేదని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్‌లోని రైతులు శీతల గిడ్డంగుల్లో పంట నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంది. అందుకే డిమాండ్ ఉన్నప్పుడు మాత్రమే పంట ఉత్పత్తులు అమ్ముకుంటారు.

గోదాదేవికి తిరునక్షత్ర మంగళహారతి



నృసింహుడి క్షేత్రంలో గోదాదేవికి మంగళహారతులు పడుతున్న మహిళలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. 10వ రోజు బుధవారం ఉదయం గోదాదేవిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పాశురాలు పఠించారు. అనంతరం అమ్మవారికి మహిళలు తిరునక్షత్ర మంగళ హారతులతో నీరాజనం పలికారు.

నేత్రపర్వంగా సంప్రదాయ పూజలు

ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ఆలయ ముఖ మండపం, ప్రాకార మండపంలో అష్టోత్తరం, సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నిత్యాదాయం రూ.65,39,905

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వివిధ విభాగాల నుంచి నిత్యాదాయం బుధవారం ఒక్క రోజే రూ.65,39,905 సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పట్టాలెక్కని డబ్లింగ్ పనులు!

బీబీనగర్- గుంటూరు మధ్య రెండో లైన్‌కు కలగని మోక్షం

- ఏడాది క్రితమే నిధులు కేటాయించిన రైల్వే శాఖ
- ఫిబ్రవరిలో టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఆగస్టులో పనులు ప్రారంభం కావాల్సి ఉన్నా జాప్యం



బీబీనగర్ - గుంటూరు రైల్వేమార్గం

బీబీనగర్: బీబీనగర్- గుంటూరు మధ్యన డబ్లింగ్ పనులకు రైల్వేశాఖ నిధులు కేటాయించినా మోక్షం కలగడం లేదు. ఆగస్టులోనే పనులు ప్రారంభం కావాల్సి ఉన్నా నేటికీ అడుగు ముందుకు పడలేదు. ఈ మార్గంలో డబ్లింగ్ కోసం ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. బీబీనగర్- గుంటూరు డబ్లింగ్ పనుల్లో భాగంగా మొదటగా నడికుడి మార్గంలో 48 కిలో మీటర్ల మేర రూ.647 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు రైల్వే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీంతో పాటు బీబీనగర్- గుంటూరు మధ్య రెండో లైన్ పనులకు కేంద్ర కేబినెట్ వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపింది. ఈమేరకు 2023లో దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. దీంతో 230 కిలోమీటర్లకు పైగా నిర్మాణ వ్యయానికి రూ.2853.23 కోట్లు కేటాయించింది. దశల వారీగా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. కేటాయించిన రూ.2853.23 కోట్లలో సివిల్ పనులకు రూ.1947.44, ఇంజనీరింగ్ నిర్మాణ పనులకు రూ.588.17కోట్లు, సిగ్నలింగ్ టెలికాం పనులకు రూ.319.62 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా వేశారు. 2024 ఫిబ్రవరిలో టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఆగస్టు నుంచి పనులు ప్రారంభం కావొచ్చని రైల్వే అధికారులు తెలిపినా.. ఇంత వరకు మోక్షం కలగలేదు.

డబ్లింగ్ పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయి

బీబీనగర్ - నడికుడి రైలు మార్గం సింగిల్‌గా ఉండడంతో గుంటూరు వెళ్లినప్పుడల్లా పలు స్టేషన్ల వద్ద రైళ్లు ఆగడంతో వేచిఉండాల్సి వస్తోంది. ఇప్పుడు రెండో లైన్ ఏర్పాటైతే మాలాంటి ప్రయాణికులకు ఇబ్బందులు తొలగుతాయి.

– వల్లపు కోటయ్య, ప్రయాణికుడు, ఒంగోలు

అందుబాటులోకి వస్తే పెరగనున్న రద్దీ

బీబీనగర్- గుంటూరు నడికుడి రెండో లైన్ అందుబాటులోకి వస్తే తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించే వారి రద్దీ పెరగనుంది. తిరుపతి, చెన్నై, ఖమ్మం తదితర ప్రాంతాలకు బీబీనగర్ నడికుడి గుంటూరు మార్గం ద్వారా దగ్గర కావడం, డబ్లింగ్‌తో రైల్వే వేగం పెరగనుండడంతో ప్రయాణికుల రద్దీ పెరగనుంది. ఇప్పటి వరకు గుంటూరు మార్గం సింగిల్ ట్రాక్ లైన్ కావడంతో ఒక రైలు వస్తే మరో రైలును ముందు స్టేషన్‌లో నిలిపేవారు. ఇప్పుడు రెండో లైన్ అందుబాటులోకి వచ్చాక ప్రయాణికులకు వేచి ఉండాల్సిన ఇబ్బందులు తొలగనున్నాయి.

క్లుప్తంగా

ఇనుప రేకుతో గొంతు కోసుకున్న వ్యక్తి

- ఆస్పత్రికి తరలించిన టూటౌన్ ఎస్ఐ



నదీమ్ గొంతుకు రక్తం కారకుండా కర్చీఫ్ కడుతున్న ఎస్ఐ నాగరాజు

నల్లగొండ క్రైం: నల్ల గొండ పట్టణంలోని ఉస్మాన్‌నగర్‌కు చెందిన సయ్యద్ నదీమ్ బుధవారం క్లాక్‌టవర్ సెంటర్‌లో ఇనుప రేకుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు గమనించి టూటౌన్ ఎస్ఐ నాగరాజుకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంటనే క్లాక్‌టవర్ సెంటర్‌కు వెళ్లి నదీమ్ గొంతకు రక్తం కారకుండా కర్చీఫ్ కట్టి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో నదీమ్ గొంతు కోసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే కొందరు తనను హత్య చేయాలని చూస్తున్నారని, అందుకే గొంతు కోసుకున్నట్లు నదీమ్ పోలీసులకు తెలిపాడు. ప్రస్తుతం నదీమ్ చికిత్స పొందుతున్నాడని, ఎలాంటి ప్రాణాపాయం లేదని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

అర్వపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అర్వపల్లి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం రామన్నగూడేనికి చెందిన రైతు గుడిపాటి వెంకన్న (44) ఈ నెల 19వ తేదీన తన వ్యవసాయ భూమి వద్ద బోరు మోటారు ఆన్ చేయగా పనిచేయలేదు. దీంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేయడానికి ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్, ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

నకిరేకల్: నకిరేకల్ మండలం పాలెం గ్రామంలో మంగళవారం రాత్రి ఓ బైక్, రెండు ట్రాక్టర్లలోని బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పాలెం గ్రామానికి చెందిన బొంత బాలకృష్ణ తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌తో పాటు చౌగోని విఠల్, ఎల్మకంటి జానయ్యకు చెందిన ట్రాక్టర్లలోని బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. బాధితులు బుధవారం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మర్రిగూడ: బైక్‌పై వెళ్తున్న యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామ స మీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం మారుపాక గ్రామానికి చెందిన పోలె వంశీ(25) చండూరు మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి వంశీ తన అత్తగారి ఊరైన మేటిచందాపురం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా లెంకలపల్లి గ్రామ సమీపంలో కి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వివాహం జరిగి ఏడాది కూడా కాలేదు. మృతుడి భార్య మనీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వచ్చి వెళ్తుండగా..



కారులో ఇరుక్కుపోయిన యశ్వంత్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు
- ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు
- భువనగిరి పట్టణంలో ఘటన

భువనగిరిటౌన్: స్నేహితులంతా కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చి వెళ్తుండగా.. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరి పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో వివిధ కాలనీలకు చెందిన అర్జున్, శ్రీరాం మితిన్, శ్రీను, సుంకరి మణిజయంత్, యశ్వంత్(17) స్నేహితులు. వీరంతా బుధవారం తెల్లవారుజామున అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ సూఫియాన్ అలియాస్ రహీం(27) ఇన్నోవా కారును అద్దెకు తీసుకుని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు బయల్దేరారు. అదే కారులో అబ్దుల్ సూఫియాన్ బంధువు షాకీబ్ కూడా ఉన్నాడు. ఉదయం 7 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుని స్వామివారి దర్శనం పూర్తిచేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట–భువనగిరి మధ్యలో ఓ హోటల్ వద్ద కారును ఆపి టిఫిన్ చేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్ హాజరుకావాలని బయల్దేరారు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి బైపాస్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొని అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న అబ్దుల్ సూఫియాన్‌తో పాటు వెనుక కూర్చున్న యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి.



యశ్వంత్ (ఫైల్)

భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలింపు..

సమాచారం తెలుసుకున్న భువనగిరి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. షాకీబ్‌తో పాటు మితిన్, మణిజయంత్‌కు తీవ్ర గాయాలవ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం వాహనంలో ఇరుక్కుపోయిన సూఫియాన్, యశ్వంత్ మృతదేహాలను పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

సెలవు రోజు కావడంతో..

అర్జున్, యశ్వంత్, మణిజయంత్, శ్రీరాం మితిన్, శ్రీను హైదరాబాద్‌లోనే వివిధ ప్రాంతాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీను, అర్జున్, మితిన్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, యశ్వంత్ నారాయణగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో, మణిజయంత్ నల్లకుంటలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కళాశాలకు రెండు రోజులు సెలవులు ఇవ్వడంతో స్నేహితులంతా కలిసి యాదగిరిగుట్టకు వచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

గర్భిణుల్లో ఫ్లోరోసిస్ లక్షణాలు

మర్రిగూడ మండలంలో నిర్వహిస్తున్న సర్వేలో బహిర్గతం



మర్రిగూడలో ఫ్లోరోసిస్ సర్వే చేస్తున్న మండల వైద్యాధికారిణి శాలిని, వైద్య సిబ్బంది



నీటి నమూనాలను సేకరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు

మర్రిగూడ: మర్రిగూడ మండలంలో ఫ్లోరైడ్‌ను పూర్తిగా రూపుమాపేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి సురక్షితమైన తాగునీటిని అందించింది. ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సారథ్యంలో ఫ్లోరైడ్ సమస్యను పూర్తిగా రూపుమాపేందుకు మర్రిగూడను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు 18వ తేదీ నుంచి ఫ్లోరోసిస్ సర్వేను వైద్యులు, వైద్య సిబ్బంది 37 బృందాలుగా ఏర్పడి 20 గ్రామ పంచాయతీల్లో 39,700మంది ప్రజలపై నిర్వహిస్తున్నారు. బుధవారం వరకు 880 కుటుంబాల్లో 4వేలకు పైగా ప్రజలపై ఈ ఫ్లోరోసిస్ సర్వేను వైద్య సిబ్బంది పూర్తిచేసినట్లు మర్రిగూడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి శాలిని తెలిపారు. అయితే గర్భిణుల మూత్ర నమూనాలను సేకరించి జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపించగా.. పలువురిలో ఫ్లోరోసిస్ లక్షణాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. అందులో శివన్నగూడ, వట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బట్లపల్లి గ్రామాల్లో అధిక ఫ్లోరైడ్ నమోదైనట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ల్యాబ్ నుంచి వెలువడిన రిపోర్ట్‌ల ఆధారంగా తెలియజేస్తామన్నారు. నిత్యం గ్రామాల్లోనే నీటి పరీక్షలు చేస్తున్నప్పటికీ నెలకొకసారి నాంపల్లి మండలంలోని బట్లపల్లిలో గల ల్యాబ్‌కు మిషన్ భగీరథ నీటి శాంపిల్స్‌ను పరీక్షించేందుకు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి అన్నారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బుధవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూకల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు తెచ్చి చరిత్రలో నిలిచిన గొప్ప వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. అనంతరం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్రకార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్, కోకన్వీనర్ పిల్లి రామరాజుయాదవ్, పట్టణ కన్వీనర్ మిర్యాల వెంకటేశం, గడ్డం వెంకట్‌రెడ్డి, ఏడుకొండల హరి, పాలకూరి రవిగౌడ్, రావెల్ల కాశమ్మ, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

డిండి: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన డిండి మండలం కొత్త తండాలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తతండాకు చెందిన జటావత్ శంకర్(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది వేరుశనగ పంట సాగు చేశాడు. బుధవారం వేరుశనగ చేనుకు నీరు పెట్టేందుకు బోరు మోటారు ఆన్ చేస్తుండగా.. అప్పటికే తెగిపడి ఉన్న కరెంట్ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

- పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న దేవరకొండ డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు

దేవరకొండ: బస్సులో దొరికిన సెల్‌ఫోన్‌ను బాధితుడి సూచన మేరకు అతడికి తెలిసిన వారికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ సిబ్బంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నానికి చెందిన కారే బంగారి బుధవారం ఉదయం దేవరకొండ నుంచి ఆర్టీసీ బస్సులో నల్లగొండకు బయల్దేరాడు. ఈ క్రమంలో బస్సులో తన సెల్‌ఫోన్‌ను మర్చిపోయి నల్లగొండలో బస్సు దిగాడు. బస్సు కండక్టర్ నాగమణి, డ్రైవర్ జగదీష్ సెల్‌ఫోన్‌ను గుర్తించి దేవరకొండ డిపోలో అందజేశారు. కొద్దిసేపటి తర్వాత బంగారి తన ఫోన్‌కు ఫోన్ చేయగా దేవరకొండ డిపో సిబ్బంది ఫోన్ ఎత్తారు. ఫోన్ బంగారిదే అని నిర్ధారించుకున్న తర్వాత అతడి సూచన మేరకు దేవరకొండలో తనకు తెలిసిన వారికి డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు ఫోన్ అప్పగించారు. నిజాయితీ చాటుకున్న డ్రైవర్, కండక్టర్‌ను అభినందించారు.

కల్తీ కల్లు తాగి ఏడుగురికి అస్వస్థత

- ముగ్గురి పరిస్థితి విషమం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
- పోలీసుల అదుపులో కల్లు విక్రయదారుడు



నకిరేకల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్(శాలిగౌరారం): కల్తీ కల్లు తాగి ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన కల్లు గీతకార్మికుడు పల్స వెంకన్న గ్రామ శివారులోని కుమ్మరికుంట వద్ద గత కొద్దిరోజులుగా ఈత కల్లు గీస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన దుబ్బాక అచ్చయ్య (50), పాక పిచ్చయ్య(42), మేడిపల్లి భిక్షం(40), గూడ లింగయ్య(45), గంట రామచంద్రు(35), కన్నెబోయిన నరేశ్(26)తో పాటు మరో వ్యక్తి సాయంత్రం పల్స వెంకన్న వద్దకు ఈత కల్లు తాగేందుకు వెళ్లారు. కల్లు తాగిన కొద్దిసేపటికే ఏడుగురికి వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లారు. బాధితులను పరీక్షించిన ఆర్ఎంపీ వైద్యుడు పరిస్థితి విషమంగా ఉందని పెద్దాస్పత్రికి తీసుకెళ్లాని బాధితుల కుటుంబ సభ్యులకు సూచించాడు. దీంతో అస్వస్థతకు గురైన ఆరుగురిని నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. దుబ్బాక అచ్చయ్య, పాక పిచ్చయ్య, కన్నెబోయిన నరేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం దుబ్బాక అచ్చయ్య, పాక పిచ్చయ్యను హైదరాబాద్‌కు, కన్నెబోయిన నరేశ్‌ను నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మేడిపల్లి భిక్షం, గూడ లింగయ్య, గంట రామచంద్రు నకిరేకల్‌లో చికిత్స పొందుతున్నారు. మరో వ్యక్తి గురించిన సమాచారం తెలియరాలేదు. ఇదిలా ఉండగా కల్లు గీతకార్మికుడు పల్స వెంకన్నను రాత్రి శాలిగౌరారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కల్తీ కల్లు ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు పోలీస్, ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు.

బాధితులను పరామర్శించిన నకిరేకల్ ఎమ్మెల్యే

కల్తీ కల్లు తాగి నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న బాధితులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం రాత్రి పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

చౌటుప్పల్ బస్టాండ్‌లో గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 14కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుబడిన నిందితులు

చౌటుప్పల్: చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం రాత్రి పోలీసులు 14 కిలోల గంజాయి పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేశారు. బుధవారం చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం పీనారిపాలెం గ్రామానికి చెందిన చెల్లూరి నాగవెంకటకృష్ణవేణి అలియాస్ దేవి కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేది. ఆర్థికంగా ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించేందుకు గాను గంజాయిని రవాణా చేయడం మొదలుపెట్టింది. ఆమెకు అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అడ్డూరి ప్రసాద్‌కు గంజాయి రవాణా చేసే క్రమంలో పాత పరిచయం ఉంది. అదే జిల్లాలోని కొయ్యూరు మండలం పెద్దపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కిముడు ప్రశాంత్ అడ్డూరి ప్రసాద్‌కు స్నేహితుడు. వీరు ముగ్గురు కలిసి స్థానికంగా తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకునేవారు.

మధ్యలోనే బస్సు దిగిన నిందితులు

ముగ్గురు కలిసి విశాఖపట్నం జిల్లా దుమ్రిగూడ మండలం సర్రాయి గ్రామానికి చెందిన ముత్తెం ప్రసాద్ వద్ద కిలో రూ.5వేల చొప్పున 14కిలోల గంజాయిని మంగళవారం నర్సీపట్నంలో కొనుగోలు చేశారు. ఈ గంజాయిని ఏడు ప్యాకెట్లుగా మార్చి బ్యాగుల్లో పెట్టుకుని హైదరాబాద్‌లో గంజాయి వ్యాపారం చేసే మహారాష్ట్రకు చెందిన త్రిభువన్ గోపాల్ రేవార్‌కు అమ్మేందుకు ఆర్టీసీ బస్సులో బయల్దేరారు. హైదరాబాద్ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారని భయపడి చౌటుప్పల్‌లో బస్సు దిగారు. బస్టాండ్‌లోకి వెళ్లి కొనుగోలుదారుడికి విషయాన్ని చెప్పి బస్టాండ్‌లోనే కూర్చుండిపోయారు.

పక్కా సమాచారంతో దాడి..

గంజాయి రవాణా విషయమై హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు అప్రమత్తమై చౌటుప్పల్ బస్టాండ్‌కు చేరుకున్నారు. నిందితుల వద్దకు వెళ్లి బ్యాగులను తనిఖీ చేయగా.. ఏడు ప్యాకెట్ల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న ఎస్ఓటీ, స్థానిక పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ధనుర్మాస వ్రతం ఎంతో పవిత్రమైంది



హుజూర్‌నగర్ : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు పరిశీలకుడు విజయ్ కుమార్

హుజూర్‌నగర్ : స్త్రీలను తరింపజేసేది ధనుర్మాస వ్రతమని టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు పరిశీలకుడు వింజమూరి విజయ్ కుమార్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాదేవి ధనుర్మాస వ్రతాన్ని తాను ఆచరించడమే కాకుండా స్త్రీలను తరింపజేసి వారంతా ఆచరించేటట్లు చేసిందని పేర్కొన్నారు. తొలుత ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. దేవరకొండ మండలంలోని తాటికోల్ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కొండమల్లేపల్లి సమీపంలో పట్టుకున్నారు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

డిండి: మండంలోని దేవత్‌పల్లితండాలో మంగళవారం భార్య చేతిలో హత్యకు గురైన రమావత్ కుమార్ మృతదేహాన్ని బుధవారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. కుమార్‌కు చందంపేట మండలం పోల్యానాయక్ తండాకు చెందిన లక్ష్మితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వగ్రామంలో వ్యవసాయం కలిసిరాక కుమార్ రెండేళ్ల పాటు భార్యతో కలిసి జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు డిండి ప్రాజెక్టు నిండటంతో ఆయకట్టుకు ఇరిగేషన్ అధికారులు నీటిని వదిలారు. దీంతో ఐదు నెలల క్రితం కుమార్ స్వగ్రామానికి తిరిగివచ్చి తన పొలంలో వేరుశనగ పంట వేశాడు. హైదరాబాద్ నుంచి తిరిగొచ్చినప్పటి నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మంగళవారం కుమార్ భార్య మరో ఇద్దరితో కలిసి కుమార్‌ను హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు లక్ష్మితో పాటు హైదరాబాద్‌లో నివాసముంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. తన కుమారుడిని కోడలు హత్య చేసిందని మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసుల అదుపులో ఉన్న లక్ష్మి బుధవారం కుమార్ అంత్యక్రియలకు హాజరుకాలేదు.

పూత, పిందె నిలిస్తేనే మామిడిలో దిగుబడి

గుర్రంపోడు : ఉమ్మడి నల్లగొండ జిలాల్లో మామిడి తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. సగ భాగం పచ్చపూత, ఇంకొంత భాగం తెల్ల పూత, ఇంకా కొంత పూత విచ్చుకోకుండా పూత మొగ్గ దశలో ఉన్నాయి. చాలావరకు పచ్చపూత నుంచి తెల్లపూతకు మారే దశలో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రెండు వేల ఎకరాలు, సూర్యాపేటలో 12 వేల ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 11 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కొన్నేళ్లుగా మామిడిలో వాతావరణ పరిస్థితులను బట్టి పూత పిందె ఆలస్యమవుతోంది. వివిధ దశల్లో ఉన్న పూత సంపూర్ణంగా రావడానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఉదయం పూట బోరు నుంచి వచ్చే గోరువెచ్చని నీరు ఒక తడి అందించాలని అనుముల ప్రాంతీయ ఉద్యానవన శాఖ అధికారి మురళి సూచిస్తున్నారు. మామిడి సాగుపై సలహాలు సూచనలు ఆయన మాటల్లోనే..



పూత దశలో ఉన్న మామిడి చెట్టు

మామిడి పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మామిడిలో జూన్ నుంచి అక్టోబర్ నెల వరకు రైతులు పాటించిన సమగ్ర సాగు పద్ధతులను బట్టి అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ముదిరిన కొమ్మల్లో మొగ్గ ఏర్పడుతుంది. కానీ జిల్లాలో వాతావరణ పరిస్థితులను బట్టి ఎక్కువగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో పూత వస్తోంది.

పాడిపంట

- ఆయా రకం, వాతావరణ పరిస్థితులను బట్టి డిసెంబర్ రెండో పక్షం నుంచి ఫిబ్రవరి వరకు పూత మొగ్గలు రావడం మొదలవుతుంది.
- పూత, పిందె రాలిపోవడానికి నీరు, పోషక లోపమే కారణం. డ్రిప్పు పైపులు అమర్చే పద్ధతి కూడా దిగుబడులపై ఎక్కువ ప్రభావం చూపుతుంది.
- నీటి తడులు ఇచ్చేటప్పుడు మొదటి, రెండు తడులు తేలికపాటి ఇచ్చిన తర్వాతనే మూడో తడి పూర్తిగా ఇవ్వాల్సి ఉంటుంది. లేని పక్షంలో పూత, పిందె రాలిపోయే ప్రమాదం ఉంది.
- చెట్టుకు తెల్ల, పచ్చపూత కంటె పూత మొగ్గ దశలో అధికంగా ఉంటే మల్టీకే (13–0–45) 5 కేజీ, సూక్ష్మ పోషక మిశ్రమం 2.5 కేజీ, ఫ్లానోఫిక్స్ 100 మిల్లీలీటర్లు, మూడింటిని 500 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పచ్చి పూత దశలో తేనెమంచు నివారణకు థయోమిత్సాన్ 200 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 80 శాతం, 100 మిల్లీలీటర్లు ఇమిగాక్లోప్రిడ్, బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ ఒక లీటరు, వేపనూనె 2లీటర్లు, 500 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పూత విచ్చుకున్న 10–15 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయకూడదు.

సమగ్ర సస్యరక్షణ

మామిడిలో పూతకు ముందు, పూత సమయం, కాయ ఎదిగే దశలో అనేక రకాలైన పురుగులు, తెగుళ్లు ఆశించి పంటకు అపారనష్టం కలుగజేస్తాయి. అదేవిధంగా సరైన నీటి యాజమాన్యం, పోషకాలు యాజమాన్యం సరిగ్గా చేపట్టని తోటల్లో పిందెలు ఎక్కువ రాలిపోవడం, కాయ సైజు తగ్గడం, నాణ్యత తగ్గిపోవడం జరుగుతుంది. కాబట్టి సస్యరక్షణ చర్యలు పాటించినట్లయితే అధిక దిగుబడితోపాటు మామిడి కాయల నాణ్యత పెరిగి అధిక లాభాలు పొందవచ్చు.

- పిందె రాలకుండా అదేవిధంగా పిందెలు బఠాణీ సైజులో ఉండి పసుపు రంగులోకి మారి రాలుతుంటే మల్టీకే(13–0–45), 2.5 కేజీ, సూక్ష్మపోషక మిశ్రమం, ఫ్లానోఫిక్స్ 100 ఎంఎల్‌లను కలిపి 500 లీటర్ల నీటిని కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేసుకోవాలి.
- పండు ఈగ నివారణకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 10–25 ఏర్పాటు చేసి 20 రోజులకు ల్యూర్‌ను మారుస్తూ పంట పూర్తయ్యే వరకు కొనసాగించాలి.
- ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలలో తప్పనిసరిగా యూరియా, పొటాష్, బోరాన్ ఎరువులు వాడుకోవాలి. ఎరువులు ఒకేసారి వేసేకంటె దఫాలుగా వేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- పిందెలు బఠాణీ సైజుకు వచ్చిన తర్వాత పది సంవత్సరాలు దాటిన ప్రతి చెట్టుకు డీఏపీ 700 గ్రాములు, యూరియా 400 గ్రాములు, పొటాష్ 600 గ్రాములు ప్రతి చెట్టుకు వేసుకుని నీరు పెట్టాలి.